News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :163 | ఖమ్మం | సోమవారం, జూలై 28, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## యూరియా విషయంలో ఆందోళన వద్దు



రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరా సౌరవికాసం పథకం ద్వారా గిరిజన

వివరాలు 2లో..

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి చేతిలో గుణపాఠం తప్పదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం ఓరుగల్లు పర్యటనకు వచ్చిన ఆమె హనుమకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాహుల్‌గాంధీని వరంగల్‌కు తీసుకొచ్చి రైతు డిక్లరేషన్ చేయించిన కాంగ్రెస్ నేతలు అందులో ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు. రైతు రుణమాఫీ 50% మందికి కాలేదు. తెలంగాణ సాధనకు ముందు 789 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం త్రిసభ్య

వివరాలు 2లో..



# ఖబడ్దార్ కేటీఆర్

## ఇకపై దుష్ప్రచారం చేస్తే నీ అంతు చూస్తం

### బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై సీఎం రమేశ్ చెప్పింది నిజమే

అది తప్పని నిరూపించే దమ్ము ఉందా?

**డేట్, టైం ఫిక్స్ చేసి చర్చకు రా**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్**

కుటుంబ, వారసత్వ పార్టీలకు బీజేపీ దూరమని వ్యాఖ్య

వివరాలు 2లో..

బీజేపీ ఎంపీ సీఎం రమేశ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రమేశ్ చేసిన వ్యాఖ్యలు నిజమేనని, సిరిసిల్ల టికెట్ రావడానికి సీఎం రమేశ్ కేటీఆర్‌కు ఆర్థికంగా సాయం చేశారని, దాని వల్లే కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారని బండి సంజయ్ అన్నారు. సీఎం రమేశ్ తో చర్చకు సిద్ధంగా ఉండాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కరీంనగర్‌లో చర్చకు వేదిక తానే ఏర్పాటు చేస్తానని, మధ్యవర్తిత్వం కూడా వహిస్తానని చెప్పారు. కేటీఆర్ వాడిన భాషను తీవ్రంగా తప్పుబట్టిన బండి సంజయ్, కేటీఆర్ భాషను మార్చుకోవాలని, లేదంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌ను "తండ్రి, కొడుకు, అల్లుడు" పార్టీగా అభివర్ణించిన బండి సంజయ్, బీఆర్ఎస్ అవినీతిలో కూరుకుపోయిందని, బీజేపీలో విలీనం అయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కంచ గచ్చబౌలి భూములు, ఓ రోడ్ కాంట్రాక్టు విషయంలో కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేయగా... సీఎం రమేశ్ అంతకు రెట్టింపు స్థాయిలో స్పందించడం తెలిసిందే. ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ ఇవ్వకపోతే, కేటీఆర్ తన వద్దకు వచ్చి వాపోయాడని సీఎం రమేశ్ వెల్లడించారు. దాంతో తాను జోక్యం చేసుకుని కేటీఆర్ కు టికెట్ ఇప్పించానని సీఎం రమేశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఇది నిజం కాదని కేటీఆర్ చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

## రాజీనామా వెనుక ఎలాంటి కుట్రలేదు



- రాజీనామాపై మరోసారి స్పందించిన రాజాసింగ్
- ఇటీవలే బీజేపీకి గుడ్ బై చెప్పిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్
- అన్నీ ఆలోచించే రాజీనామా చేశానని స్పష్టీకరణ

హైదరాబాదులోని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవలే బీజేపీకి రాజీనామా చేయడం తెలిసిందే. బీజేపీ హైకమాండ్ చెబితే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని వెల్లడించారు. తాజాగా ఆయన తన రాజీనామాపై మరోసారి స్పందించారు. తన రాజీనామా వెనుక ఎలాంటి కుట్ర లేదని స్పష్టం చేశారు. ఎవరి వల్ల పార్టీకి డ్యామేజి జరిగిందో, ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానానికి చెప్పడానికి ప్రయత్నించానని వెల్లడించారు. లక్షల మంది కార్యకర్తలు బీజేపీ కోసం తమ జీవితాలను త్యాగం చేశారని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఒక యోధుడు కావాలి అని అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తనకు ఫోన్ చేయలేదని, ఆయన ఫోన్ చేసేంతటి పెద్ద వ్యక్తిని కానని రాజాసింగ్ అన్నారు. తాను మళ్లీ బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నానని, అందుకే కార్యకర్తల బృందాన్ని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపానని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని రాజాసింగ్ స్పష్టం చేశారు. తాను అన్ని విధాలుగా ఆలోచించిన తర్వాతే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

వివరాలు 2లో..



# స్పెర్మ్ డొనేషన్ దందా

## క్లినిక్ పై పోలీసుల రెయిడ్

- అహ్మదాబాద్ లో సంతాన సాఫల్య కేంద్రం, హైదరాబాద్ లో వీర్యం సేకరణ
- వీర్య దాతలకు రూ.4 వేలు చెల్లిస్తున్న నిర్వాహకులు
- టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాకంతో రాష్ట్రంలోని స్పెర్మ్ క్లినిక్ లపై దాడులు

సికింద్రాబాద్ లో సంతానం కోసం వెళ్లిన దంపతులకు వేరొకరి వీర్య కణాలతో చికిత్స చేసిన టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాకం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. డీఎన్ఏ టెస్టుతో సదరు టెస్ట్ ట్యూబ్ సెంటర్ భాగోతం బయటపడగా.. నిర్వాహకులపై బాధిత దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సెంటర్ నిర్వాహకురాలైన వైద్యురాలిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఉదంతం నేపథ్యంలో హైదరాబాద్ లోని పలు స్పెర్మ్ క్లినిక్ లపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, ఉన్నతాధికారులు దాడులు చేశారు. దీంతో నగరంలోని ఓ స్పెర్మ్ క్లినిక్ దందా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ లోని ఓ స్పెర్మ్ క్లినిక్ పలువురు దాతల నుంచి వీర్యం సేకరిస్తోంది. వీర్య దానం చేసిన ప్రతిసారీ దాతలకు రూ. 4 వేల చొప్పున చెల్లిస్తోంది.

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలి

- నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలికల వసతి గృహంలో ఫుడ్ పాయిజనింగ్
- అస్వస్థతకు గురైన బాలికలు
- బాలికలను పరామర్శించిన బీఆర్ఎస్ నేత హరీశ్ రావు



నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలిక వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరగడంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్పందించారు. ఫుడ్ పాయిజన్ కు గురై చికిత్స పొందుతున్న బాలికలను హరీశ్ రావు నేడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## చర్చిపై ఉగ్రవాదుల దాడి.. 21 మంది మృతి

### కాంగోలో మారణహోమం..



దేశమేదైతేనేం.. దేవుడి పేరున మారణహోమాలు జరుగుతూనే ఉన్నాయి. మత ద్వేషం.. మత మౌఢ్యంతో సాటి మనుషులను చంపుతూనే ఉన్నారు. ఎవరి మతం వారిదే.. ఎవరి సంస్కృతి వారిదే.. అనుకునే ఇంగిత జ్ఞానం లేక అమాయకులను పొట్టన పెట్టుకుంటూనే ఉన్నారు. ఆదివారం కాంగోలో జరిగిన ఉగ్రదాడిలో 21 మంది చనిపోవడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. కాంగోలో ఉగ్రవాదులు దారుణ మారణ హోమానికి పాల్పడ్డారు. తూర్పు కాంగోలో ఓ చర్చిపై ఇస్లామిక్ స్టేట్ సంస్థ మద్దతు దారులు దాడి

వివరాలు 2లో..

### బోరబండకు రూ. 12 కోట్లు నిధులు కేటాయిస్తాం..

## అభివృద్ధి చేసుకుందాం



ఆదివారం ( జులై 27 ) బోరబండ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా కార్య కర్తలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్. కార్యకర్తలంతా కలిసి పనిచేసి పార్టీని స్ట్రాంగ్ చేసుకోవాలని అన్నారు. కార్యకర్తలు ప్రజల సమస్యలను వినాలని... బాబా ఫసియొద్దీన్ బోరబండ సమస్యలపై లిస్ట్ ప్రిపేర్ చేసి తనకు ఇచ్చారని..

వివరాలు 2లో..



## తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటది..

# ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదు

బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేసే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉన్నంతకాలం బీఆర్ఎస్ ఉంటుందన్నారు. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ ప్రజల కష్టాలు పోతాయని చెప్పారు. రాష్ట్రంలో ఎరువుల కోసం యుద్ధం చేయాల్సి వస్తోందన్నారు. నల్లబెల్లిలో మహిళా రైతుపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు.. ప్రభుత్వం నడిపే పద్ధతి ఇదేనా అని ప్రశ్నించారు కేటీఆర్. మీడియాతో మాట్లాడిన కేటీఆర్. . పాలిచ్చే బర్రెను పక్కనబెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఏమైంది..? కరోనా సంక్షోభంలోనూ అభివృద్ధి,

వివరాలు 2లో..

# స్పెర్మ్ డొనేషన్ దందా

- మొదటి పేజి తరువాయి

ఇలా సేకరించిన వీర్యాన్ని గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఉన్న ఫెర్టిలిటీ సెంటర్ కు పంపిస్తోంది. ఇక్కడ సేకరించిన వీర్యంతో అక్కడ సంతానం లేని దంపతులకు పిల్లలు పుట్టేలా చికిత్స చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

**సికింద్రాబాద్ లోని ఇండియన్ స్పెర్మ్ క్లినిక్ ఈ దందా నిర్వహిస్తోంది.**

ఈ క్లినిక్ కు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన అధికారులు.. కేసు నమోదు చేసి నిర్వాహకులతో పాటు ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాజా ఘటనల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంతాన సాఫల్య కేంద్రాలు, స్పెర్మ్ క్లినిక్ లలో సోదాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ భాగోతంపై డీసీపీ రష్మి పెరుమాళ్ ప్రెస్ మీట్...**

హైదరాబాద్ లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు టెస్ట్ ట్యూబ్ బేబీ పద్ధతి జరగలేదని..వేరే వాళ్లకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి దంపతులకు ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. టెస్ట్ ట్యూబ్ బేబీకి దంపతుల నుంచి డాక్టర్ నమ్రత 40 లక్షల వరకు తీసుకున్నట్లు చెప్పారు.

ఈ కేసు వివరాలను వెల్లడించిన నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ ..గోపాలపురం లో ఓ జంట ఇచ్చిన ఫిర్యాదుతో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పై రైడ్ చేశాం. ఆన్ లైన్ లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ గురించి తెలుసుకుని రాజస్థాన్ కు చెందిన ఓ జంట అప్రోచ్ అయ్యింది. సరోగసి పద్ధతిలో పిల్లలు పుట్టించేందుకు రూ. 30 లక్షలు అవుతాయని డాక్టర్ నమ్రత దంపతులకు చెప్పారు. దీంతో దంపతులిద్దరు విజయవాడ వెళ్ళి అక్కడ శ్యాంపిల్ ఇచ్చారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికింది అని డాక్టర్ చెప్పారు.

కొన్ని నెలల తర్వాత బాబు పుట్టాడని ఆ జంటకి చెప్పారు డాక్టర్ నమ్రత. సిజేరియన్ ద్వారా డెలివరీ అయ్యిందని చెప్పి మరో రూ. 10 లక్షలు అదనంగా వసూలు చేశారు. కొన్ని నెలల తర్వాత దంపతులకు బాబు పోలికలు అనుమానాస్పదంగా అనిపించాయి. డీఎన్ఏ టెస్ట్ చేయాలని డాక్టర్ ను అడిగారు. ఇందుకు నమ్రత ఒప్పుకోలేదు. దీంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ ఏ టెస్ట్ చేయించారు. మరొకరి డీఎన్ ఏగా తేలడంతో డాక్టర్ నమ్రత ను నిలదీశారు. అయితే దంపతులపై నమ్రత తన కొడుకు జయంత్ తో కలిసి బెదిరింపులకు పాల్పడ్డారు. వేరే మహిళకి పుట్టిన బిడ్డను తీసుకొచ్చి సరోగసి ద్వారా మీకు పుట్టిన బిడ్డ అని దంపతులను నమ్మించారు డాక్టర్ నమ్రత. ఢిల్లీకి చెందిన ఓ గర్భిణిని ఫ్లైట్ లో వైజాగ్ తీసుకొచ్చారు. అక్కడ డెలివరీ చేశారు..ఆమెకు పుట్టిన బిడ్డను వాళ్లకు ఇచ్చారు. బిడ్డను వద్దనుకున్న ఆ మహిళకు రూ. 90 వేలు ఇచ్చారు. డాక్టర్ నమ్రతపై రెండు రాష్ట్రాల్లో 10 కి పైగా కేసులు ఉన్నాయి. %×ఎఖీ% ఫెయిల్యూర్, సరోగసిలో అక్రమాలు వంటి కేసులు నమ్రత పై ఉన్నాయి. ఈ కేసులో ఇంకా చాలా మంది పాత్ర ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ తరహా యాక్టివిటీస్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాము. ఈ కేసుల్లో 8 మందిని అరెస్ట్ చేసాము. ఏడుగురిని రిమాండ్ కు తరలించాము అని తెలిపారు.

**అనుమతి లేకుండానే**

సృష్టి సెంటర్ పై రైడ్ లో తాము కూడా పాల్గొన్నామని హైదరాబాద్ DM & HO వెంకట్ తెలిపారు. 2020 లోనే వాళ్ళ అనుమతులు క్లోజ్ అయ్యాయని చెప్పారు. హాస్పిటల్ మూసేస్తున్నాం అని చెప్పారు. వాళ్లకి క్లోజింగ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చాం... అక్రమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నడుపుతున్నారు. సెంటర్ లో థియేటర్ గుర్తించాం. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ ఎక్స్ పైరీ అయినా కూడా అక్రమంగా హాస్పిటల్ నడుపుతోంది. అనస్థీషియా ల్యాబ్ ఉంది.. బెడ్స్ ఉన్నాయి. 7 రకాల అనాలసిస్ చేసే ఎక్విప్మెంట్ ఉంది. డస్ట్ బిన్ చెక్ చేస్తే.. రెగ్యులర్ ప్రాసెస్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించామని అన్నారు.

## తెలంగాణ ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటది.. ఎవరితోనూ కలిసే ప్రసక్తే లేదు

- మొదటి పేజి తరువాయి

సంక్షేమ పథకాలు ఆగలేదు. కానీ ఇప్పుడు అన్నీ ఉన్నా పథకాలు అమలు కావడం లేదు. అటు ఇటు కానోడు పరిపాలిస్తే ఇలాగే ఉంటది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఇజ్జత్ లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినే చూస్తున్నాం. మన ఖర్మకాలి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. ప్రభుత్వం ఎటుంటే పోలీసులు అటుంటారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ను గెలిపించాలి. కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి అని అన్నారు. లిక్కర్ కేసులో కవితపై విచారణ ఆపేస్తే బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేస్తామని కేటీఆర్ చెప్పినట్లు ఏపీ ఎంపీ సీఎం రమేశ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

## కాంగోలో మారణహోమం.. చర్చిపై ఉగ్రవాదుల దాడి.. 21 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

చేయడంతో 21 మంది మృతి చెందారు. అల్లైడ్ డెమొక్రటిక్ ఫోర్స్ కు చెందిన ఉగ్రవాదులు అర్ధరాత్రి కోమండా చర్చిలో దాడికి దిగారు. ఈ దాడిలో చర్చితో పాటు చుట్టుపక్కల ఉన్న ఇండ్లు, షాపులు ధ్వంసం అయ్యాయి. ఉగ్రదాడిలో చర్చి లోపల, బైట ఉన్న వ్యక్తులు మొత్తం 21 మంది చనిపోయారు. దుండగుల కోసం వేట కొనసాగుతోందని సివిల్ సొసైటీ కోఆర్డినేటర్ డ్యూడన్నే దూరంతబో తెలిపారు. ఈ దాడిపై కాంగో ఆర్మీ స్పందించింది. చర్చిలోకి ఆయుధాలతో కూడిన వ్యక్తి ప్రవేశించాడు. ఆయుధాలతో మారణహోమం సృష్టించాడని ఆర్మీ పేర్కొంది.ఇస్లామిక్ స్టేట్ తో సంబంధాలున్న రెబల్ గ్రూప్ %ూణఖీ%.. ఉగాండా, కాంగో రిపబ్లిక్ బార్డర్ లో ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతుంటుంది. గత పదేళ్లుగా కాంగోలో ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతూ వస్తున్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

కమిటీ ఏర్పాటు చేసి 400 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేసింది. మిగతా 389 మంది కుటుంబాలకు నాలుగేళ్ల పాటు తెలంగాణ జాగృతి తరఫున నెలకు రూ.4,500 చొప్పున పింఛను అందించాం. మామునూర్ విమానాశ్రయానికి రాణీ రుద్రమదేవి పేరు పెట్టాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏనాడూ జై తెలంగాణ అనని రేవంత్‌రెడ్డి నేడు రాష్ట్రానికి సీఎం కావడం ప్రజల దురదృష్టం. ఆగస్టున 6న ఆచార్య జయశంకర్ జయంతి ఉత్సవాలను వరంగల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తాం' అని కవిత వెల్లడించారు.

# యూరియా విషయంలో ఆందోళన వద్దు

రైతులకు సోలార్ పంపులు, డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు ఉచితంగా అందిస్తామని... మూడేళ్లలో ఇందుకోసం రూ.12,600 కోట్లు వెచ్చిస్తామని తెలిపారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ యూరియా కొరత ఉన్నట్టు జరిగే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దన్నారు. ఆగస్టు రెండో వారంలో చేపపిల్లల పంపిణీ చేపడతామని, చెరువు గట్లపై వాటిలో పెంచే చేపపిల్లల వివరాలను ఉంచుతామని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా రైతులకు సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూశాఖలో అవకతవకలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టులో శ్రావణ మాసం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రులు, వసతిగృహాల పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ఓ ప్రత్యేక అధికారిని నియమించి, ప్రతినెలా వాటిని సందర్శించి నివేదికలు అందించాలన్నారు.

సమీక్షలో ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, ఉభయ జిల్లాల ఎమ్మెల్యేలు, అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు, ఉభయ జిల్లాల ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అధికారులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలి

- మొదటి పేజి తరువాయి

"గతంలోనూ ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరిగితే, మరోసారి ఇలాంటివి చోటుచేసుకుంటే చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి అన్నారు... మరి ఉయ్యాలవాడ ఘటన ఎలా జరిగింది? సీఎం ఆదేశాలు అధికారులు పాటించడం లేదా? ఢిల్లీకి వెళ్లడానికి దొరికిన సమయం, విద్యార్థుల సమస్యలపై మాట్లాడేందుకు దొరకదా? ఫుడ్ పాయిజనింగ్ అంశాన్ని అసెంబ్లీలో చర్చకు పెట్టాలి... మానవ హక్కుల కమిషన్, హైకోర్టు వీటిని సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలి... రేవంత్ రెడ్డీ... మాపై కోపం ఉంటే మమ్మల్ని జైల్లో పెట్టండి... అంతేగానీ విద్యార్థుల భవిష్యత్ తో ఆడుకోకండి" అంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## బోరబండకు రూ. 12 కోట్లు నిధులు కేటాయిస్తాం.. అభివృద్ధి చేసుకుందాం

- మొదటి పేజి తరువాయి

ఒక్కొకటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు మంత్రి వివేక్. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ తో కూడా మాట్లాడానని అన్నారు.బోరబండలో సీసీ రోడ్లు, రోడ్ వైండింగ్ లాంటి సమస్యలను పరిష్కరిస్తాననిరూ. 10 నుంచి 12 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు మంత్రి వివేక్. బూత్ కమిటీలను స్ట్రాంగ్ చేసుకొని భవిష్యత్తులో బోరబండను అభివృద్ధి చేసుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు మంత్రి వివేక్. ఇంచార్జ్ మంత్రి పొన్నం పైన ఒత్తిడి తెచ్చి ఇంకా ఎక్కువ నిధులు తెచ్చుకోవాలని అన్నారు. రేషన్ కార్డుల కోసం పదేళ్లుగా ఎదురు చుసినవారికి రేవంత్ సర్కార్ లో రేషన్ కార్డ్స్ వస్తున్నాయని అన్నారు. బోరబండ డివిజన్ కు సంబంధించి కార్డు వచ్చిన, రానివారి లిస్ట్ రెడీ చేయాలని అన్నారు. రెండు వందల యూనిట్ల ఫ్రీ కరెంటు ఇస్తున్నామని.. రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంచుకున్నామని అన్నారు మంత్రి వివేక్. ఇందిరమ్మ ఇళ్లను ఎక్కువ ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నామని.. ఇక్కడ ఇంకా అవసరం ఉంటే ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు సన్న బియ్యం ఇస్తున్నామని.. మన పిల్లలకు మంచి భోజనం పెడ్తున్నామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని, తాము అండగా ఉంటామని అన్నారు. బోరబండకు కావాల్సినన్ని నిధులు కేటాయించే బాధ్యత తనదేనని అన్నారు మంత్రి వివేక్.

# రాష్ట్ర ప్రతిష్ఠ పునరుద్ధరణే లక్ష్యం

'ఒక వ్యక్తి తప్పు చేస్తే.. తెలుగు వాళ్లు చేశారనే అంటారు. దానివల్ల రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతిని, బ్రాండ్ పోతుంది. రాష్ట్రం శాశ్వతంగా నష్టపోతుంది. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైకాపా.. సింగపూర్ ప్రభుత్వాన్నీ తప్పుబట్టింది. మీకు జరిగిన అసౌకర్యానికి నేను బాధపడుతున్నానని వారికి చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది. సింగపూర్‌తో సంబంధాలు పునరుద్ధరించాలన్నదే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా ఆదివారం తెలుగు డయాస్పోరా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు లోకేశ్, నారాయణ, టీజీ భరత్, ఏపీ ఎన్నార్టీఎస్ ఛైర్మన్ వేమూరి రవి, సింగపూర్‌లో భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే పాల్గొన్నారు. 'మా తెలుగు తల్లికి' గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది. అమరావతి రాజధానిపై రచించిన గీతాన్ని ఆలపించారు.

### అప్పట్లో అడగ్గానే అంగీకరించారు

2014 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని సింగపూర్‌లా మారుస్తానని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.. ఫలితాలు వచ్చాక సింగపూర్ వెళ్లానని సీఎం పేర్కొన్నారు. 'ఏపీకి రాజధాని లేదు. మాస్టర్‌ప్లాన్ కోసం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడానికి సమయం పడుతుంది. నాకు ఉచితంగా మాస్టర్‌ప్లాన్ ఇవ్వాలని సింగపూర్ ప్రభుత్వాన్ని కోరా. అందుకు అప్పటి ప్రధాని లీ అంగీకరించారు. వారి భాగస్వామ్యంతో సీడ్ క్యాపిటల్ నిర్మిస్తే.. ప్రపంచంలోని ఇతర సంస్థలూ వస్తాయని సింగపూర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. తర్వాత వచ్చిన ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టింది' అన్నారు. సుస్థిర ప్రభుత్వం ఉంటే అద్భుతాలు సాధించవచ్చనడానికి సింగపూర్ ఉదాహరణ అని సీఎం పేర్కొన్నారు. '2004లో ఉమ్మడి రాష్ట్రంలో తెదేపా అధికారంలోకి వస్తే సింగపూర్‌తో సమానంగా మనం అభివృద్ధి చెందేవాళ్లం. 2019లో మళ్లీ గెలిచి ఉంటే అమరావతి, పోలవరం పూర్తయ్యేవి. ఇక్కడా అంతరాయం వచ్చింది. ఇందులో నా తప్పు ఉందా? రాబోయే రోజుల్లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తా. నన్ను సరైన మార్గంలో పెట్టే బాధ్యత ఎన్ఆర్ఐలుగా మీపై ఉంది' అని పేర్కొన్నారు.

**డయాస్పోరాలో చంద్రబాబు ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రవాసాంధ్రులు**

### జన్మభూమికి తిరిగిచ్చే సమయం

"ఐటీని ప్రోత్సహించడం తెలుగు ప్రజలు సాంకేతికంగా ఎదిగేందుకు దోహదం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 128కి పైగా దేశాల్లో తెలుగు వారు ఉన్నారు. సింగపూర్‌లో 40 వేల మంది తెలుగువాళ్లు ఉన్నారు. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్ముతో ఎదిగిన మీరు.. ఇప్పుడు తిరిగిచ్చే సమయం వచ్చింది. మీకు అవకాశం కల్పించిన కర్మభూమి అభివృద్ధికి పనిచేస్తూనే.. జన్మభూమికి తిరిగివ్వాల్సిన బాధ్యత మీపై ఉంది. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించే మిషన్ ప్రారంభించాం. మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి" అని చంద్రబాబు కోరారు. ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్న తెలుగు ప్రజలు తమ అనుభవాన్ని ఏపీకి అందించాలని సీఎం కోరారు. 'మీరంతా ఏపీలో పెట్టుబడులు పెట్టొచ్చు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఒక కంపెనీ ఏర్పాటు చేయాలంటే.. ఎక్కడి నుంచైనా సాధ్యమే. సర్వీసు ప్రొవైడర్లుగా స్టార్టప్‌లు పెట్టేందుకు ముందుకొస్తే పూర్తిగా సహకరిస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

### సింగపూర్ అంటే గౌరవం

సింగపూర్ అంటే తనకు అభిమానం, గౌరవమని చంద్రబాబు పేర్కొన్నారు. 'ఇక్కడి క్రమశిక్షణ నన్ను ఆకర్షించింది. రోడ్డుమీద ఒక్క కాగితం ముక్క కనిపించేది కాదు. ఒకరోజు రాత్రంతా తిరిగి చెత్తసేకరణ విధానాన్ని పరిశీలించా. దాన్ని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం గురించి తెలుసుకుని.. హైదరాబాద్‌లో అమలుచేశా. దీన్ని అప్పటి సింగపూర్ ప్రధాని లీ క్వాన్ కూడా మెచ్చుకున్నారు. సింగపూర్‌లో కారు డ్రైవర్‌కు టిప్ ఇద్దామని ప్రయత్నించినా తిరస్కరించారు. ఇక్కడ ఎవరూ డబ్బులు తీసుకోరని డ్రైవర్ చెప్పారు' అని పేర్కొన్నారు.

### తిరుమల.. మన అదృష్టం

వేంకటేశ్వరుడు కొలువైన తిరుమల మన రాష్ట్రంలో ఉండడం మన అదృష్టమని సీఎం పేర్కొన్నారు. 'ఎన్ఆర్ఐలకు వెంకన్న దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి' అని తెలిపారు. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమాన సేవలు త్వరలో అందుబాటులోకి తెస్తామని సీఎం పేర్కొన్నారు. 'ప్రపంచంలోనే గౌరవప్రదమైన కుటుంబ వ్యవస్థ మనది. మన సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించాలి. ఇక్కడి స్కూళ్లలో తెలుగు కూడా బోధించాలి' అని కోరారు.

## చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడిలో రైతు మృతి... పవన్ కల్యాణ్ స్పందన

ఆంధ్రప్రదేశ్‌లో జనావాసాల్లో ఏనుగుల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏనుగులు సంచరించే మార్గాలపై పర్యవేక్షణ ఉంచాలని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడిలో మరో రైతు మరణించిన ఘటన తర్వాత, ఆయన ఈ సమస్యను తీవ్రంగా పరిగణించారు.

చిత్తూరు జిల్లాలోని కొత్తూరు గ్రామంలో రామకృష్ణ రాజు అనే రైతు పొలంలోకి వెళ్లినప్పుడు ఏనుగుల దాడిలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే అటవీశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. గత మూడు నెలలుగా సుమారు 15 ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తూ వ్యవసాయ భూములను ధ్వంసం చేస్తోందని అధికారులు వెల్లడించారు. అటవీశాఖ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ ఏనుగులు మానవ జీవితాలకు, పంటలకు ముప్పుగా మారాయని తెలిపారు. 2011 నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల దాడుల్లో సుమారు 25 మంది మరణించినట్లు అటవీ అధికారులు వివరించారు.

ఈ నేపథ్యంలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగుల గుంపులు సంచరించే మార్గాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ఆయా ప్రాంతాల్లోని రైతులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. మరణించిన రైతు కుటుంబానికి అటవీశాఖ, జిల్లా యంత్రాంగం తరపున సానుభూతిని తెలియజేసి, నష్టపరిహారం అందించాలని సూచించారు.

గతంలో, పవన్ కళ్యాణ్ ఏనుగుల దాడులను నివారించడానికి ఏఐ ఆధారిత ట్రాకింగ్ మరియు అధునాతన హెచ్చరిక వ్యవస్థలను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కర్ణాటకలో విజయవంతమైన ఏఐ ఆధారిత ఏనుగుల ట్రాకింగ్ కార్యక్రమాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలని సూచించారు.

ఇప్పటికే కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయి. ఈ ఏనుగులకు శిక్షణనిచ్చి, సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరింపజేయనున్నారు. అంతేకాకుండా, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఏనుగులు ఆకర్షించే అరటి, చెరకు వంటి పంటలకు బదులుగా తక్కువ ఆకర్షణీయమైన మినుములు, పప్పుధాన్యాలు వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సలహా ఇవ్వాలని ఆయన అన్నారు.

# ఈ అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేది ఎప్పుడు

- పంచాయితీ నోటీసులు ఇచ్చిన లెక్కచేయని బిల్డర్లు.
- జి ప్లస్ టు కు పర్మిషన్ తీసుకుని 5 6 అంతస్తులు నిర్మానాలు.
- ఇది హెచ్ఎండిఏ పర్మిషన్ అనుకుంటే పప్పులో కాలేసినట్టే.




**సికే న్యూస్ ప్రతినిధి** పటాన్చెరు నియోజకవర్గం సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం లోని ఇంద్రేశం గ్రామ పంచాయతీ పరిధిలో విచ్చలవిడి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు పంచాయతీ సెక్రెటరీ నోటీసులు ఇచ్చిన లెక్కచేయని బిల్డర్లు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టిన పెడచెవిన పెట్టి కూల్చిన మళ్లీ నిర్మాణాలు యధావిధిగా చేపడుతున్నారు హద్దు అదుపు లేకుండా బిల్డర్లు చెలరేగిపోతున్నారు జి ప్లస్ టు కు అనుమతులు తీసుకొని నాలుగు ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారు హెచ్ఎండిఏ అనుమతులు తీసుకోకుండా గ్రామపంచాయతీ అనుమతితోనే నిర్మాణాలు చేపట్టి గ్రామపంచాయతీకి భారీగా ఖజానాకు గండి కొడుతున్నారు పలుమార్లు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేస్తున్న అధికారంలో ఉన్న వాళ్లతో ఫోన్లు చేయించి కార్యదర్శిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు ఇదే విధంగా కొనసాగితే గనుక గ్రామపంచాయతీలో ఖజానాకు గండి పడడం ఖాయం ఇకనైనా డిపిఓ జిల్లా అధికారి స్పందించి ఈ అక్రమ నిర్మాణాల పైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

# వర్షాకాలం మొదలైన తాగునీటి కష్టాలు తీరలేదు పోలంపల్లిలో

- పట్టించుకోని మిషన్ భగీరథ యాజమాన్యం





**జులై 27 (సీ కే న్యూస్) చేగుంట :**పోలంపల్లి గ్రామంలో మిషన్ భగీరథ త్రాగునీరు ఎదుడ్డి కథనం ప్రకారం చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో నీటీ సమస్య త్రివంగ ఉంది ప్రజలు తాగునీటి కొరతతో బాధపడుతున్నారు, నీటి సమస్య గురించి ప్రజలు చాలా రోజులుగా ఫిర్యాదు చేస్తున్నారు కానీ ఇంకా పరిష్కారం కాలేదు ప్రజలు నీటి కొరత కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు వారు నీటి సమస్య వల్ల ప్రజల జీవితం చాలా అధ్వతరంగా మారింది గత ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించలేదు, మిషన్ భగీరథ మేనేజ్మెంట్ నీటి సరఫరాను మెరుగుపరచక లేకపోవడం జరుగుతుంది మిషన్ భగీరథ అధికారులకు ఎన్నిసార్లు మొర్ర పెట్టిన నీటి సమస్య తీరలేదు ఇప్పటికైనా మా గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి మంచినీటీ కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, గత 30 సంవత్సరాల కింద్రట ప్రభుత్వలు హ్యాండ్ పంప్ బోర్ల వేశారు, మిషన్ భగీరథ నీరు రావడంతో హ్యాండ్ పంపులు వాడలేక శిథిలావస్థలం చేరాయి, అందులో ఉన్న హ్యాండ్ పంపులు ప్రభుత్వాలు తీసివేయగా, కొన్ని సంవత్సరాలుగా నీటి భారత కొరత బాగానే ఉంది కానీ, మిషన్ భగీరథ మోటర్లు పెట్టినప్పుడు ఇబ్బంది వస్తుంది, నీటి సమస్య తీరాలంటే ప్రభుత్వాలు వేసిన బోర్లలో అక్కడక్కడ ఉన్న కాళీ బోరుబావలంలో సింగిల్ మోటార్స్ పంపులు బిగించాలి కానీ, ఎంతమంది వ్యక్తులు ఖాళీగా ఉందని మా పట్ట భూమిలో ఉంది అని అందులో సింగిల్ మోటార్ పంపులు, దింపుకొని వారిదే అన్నట్టుగా, హుందాగా ఉన్నారు మూడు నెలలుగా మా గ్రామానికి మిషన్ భగీరథ మీరు రాకపోవడంతో సమస్య తీవ్రమైతుంది, అధికారులకు మొర పెట్టగా అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారు, గవర్నమెంట్ వేసిన బోర్ల వద్దకు వెళితే, ఇది మా పట్టా జాగాలో ఉంది, మాది ఇక్కడికి మీరు ఎవరైనా రావద్దు, అని బెదిరించడం జరుగుతుంది, పొలంపల్లిలో ప్రభుత్వం, వేసిన బోరుబావులలో ఒకే ఒక బోరుబావిలో సింగిల్ ఫేస్ మోటార్ ఉండడంతో గ్రామ ప్రజలకు తీరని అవస్థలు ఎదురవుతున్నాయి దయచేసి ఇప్పటికైనా ప్రభుత్వం వేసిన బోర్లా వద్ద వాళ్లు సింగిల్స్ ప్లేజ్ మోటర్ దింపుకున్నారో వారితో మాట్లాడి అది ప్రభుత్వ ఆదినంలోనికి తీసుకోవాలని కోరారు, లేదంటే వారి పైన కఠిన చర్యలు తీసుకొని పోల్లంపల్లి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులను మరియు ప్రభుత్వ అధికారులు కోరడం జరిగింది,

## పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలో 50 బాదం మొక్కలు నాటిన డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్.





**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 27,**ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ లో స్థానిక ఎంపీటీసీ స్థానిక సర్పంచ్ ల సహకారంతో పురుషోత్తపట్నం లోని గ్రామస్తులు కలుపుకొని సెయింట్ అన్స్ స్కూల్ జంక్షన్ వద్ద నుంచి పురుషోత్తపట్నం వెళ్లే దారిలో ఎడమవైపున 50 బాదం మొక్కలను నాటరూ. ఈ సందర్భంగా డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన సకాలంలో వర్షాలు పడతాయి, మొక్కలు కార్బన్ దయాక్సైడ్ తీసుకొని తిరిగి ప్రాణవాయువుని ఇస్తాయి మనకి, అంతేకాకుండా పక్షులకు మరియు ఉడతలకు ఆహరముగా బాదం కాయలు మీద వుండే తొక్కు, మరియు మండు వేసవిలో కూడా మనకి ఆహ్లాదమైన చల్లని వాతావరణాన్ని కలగజేస్తాయి అని తెలిపారు. ఎక్కువ కాలం బ్రతికి మరియు తక్కువ నీటి వసతులలో బ్రతుకుతుంది కాబట్టీ ఈ మొక్కలు నాటడం ఎంపిక చేసుకున్నాను అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, పురుషోత్తపట్నం సర్పంచ్ బుద్ధ ఆదినారాయణ, గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రవ్వ సుబ్బయ్య , మహంతి వెంకట కృష్ణాజి, డివి శంకర్రావు, వాసవి ఐ కేర్ రవితేజ, సునీల్, శ్యామ్, భోగాల వీరారెడ్డి, సారెడ్డి పెద్ద శ్రీనివాసరెడ్డి, బారెడ్డి లక్ష్మారెడ్డి, గార్లపాటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ చిన్న శ్రీనివాస్ రెడ్డి, చుంచు వెంకటేశ్వరరావు, పుట్టి అప్పారావు, వలవల నాగేంద్ర, కొండపల్లి నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 212 సి.ఆర్.పి.ఎఫ్ బెటాలియన్ కార్యాలయం లో 87వ వార్షికోత్సవ వేడుకలు.






**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి,( సాయి కౌశిక్),జూలై 27,** అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం లోని సి. ఆర్. పి. ఎఫ్ 212 బెటాలియన్ ప్రాంగణంలో 87వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమం ప్రారంభంలో, బెటాలియన్ అధికారులు సైనికులు అమరవీరులకు నివాళులర్పించారు, ఆ తర్వాత కమాండెంట్ క్వార్టర్ గార్డ్‌లో సెల్యూట్ స్వీకరించి, వివిధ రంగాలలో సిఆర్పిఎఫ్ సాధించిన విజయాల గురించి, మార్చి 2026 నాటికి ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజం అంతం గురించి చెప్పి, హాజరైన సైనికులకు స్వీట్లు పంపిణీ చేశారు. దీని తర్వాత, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీనితో పాటు, కిష్టారాం డబ్బా మార్కలలో సైకిల్ ర్యాలీ నిర్వహించ బడింది, దీనిలో ప్రస్తుత అధికారులు, సబార్డినేట్ అధికారులు జవాన్లతో పాటు, స్థానిక గ్రామస్తులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ చొరవను స్థానిక ప్రజలు ఎంతో అభినందించారు. ఈ సందర్భంగా, 212 బెటాలియన్ కమాండెంట్ దీపక్ కుమార్ వాస్తవ, డాక్టర్ సుమిత్ సెహగల్, సెకండ్ కమాండ్ ఆఫీసర్ దినేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ అజయ్ ప్రతాప్, డిప్యూటీ కమాండెంట్ గౌరవ్ శర్మ మరియు అన్ని అధీన అధికారులు సైనికులు సమావేశమయ్యారు.






# సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎస్, సాబీర్ పాషా.

- 03 వ సారి ఏకగ్రీవ ఎన్నిక.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / అశ్వారావుపేట ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 27,**భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఎస్కే సాబీర్ షాషా ఎన్నికయ్యారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్ (మియాజానీ నగర్) లో రెండవ రోజు ఆదివారం జరిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ 3వ మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య సమక్ష్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మహాసభలో సిపిఐ నూతన జిల్లా కౌన్సిల్ ను ఎన్నుకున్నారు. 79 మంది కౌన్సిల్ సభ్యులు, 27 మంది కార్యవర్గ సభ్యులు మరో ముగ్గురు ఆహ్వానింతులుగా 30 మందితో కార్యవర్గం మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించి విద్యార్థి,కార్మిక ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించిన పాషా మూడో సారి జిల్లా కార్యదర్శిగా ఎంపికకావడం పట్ల పలువురు హర్యంవ్యక్తం చేస్తున్నారు. 1995లో ఏఐఎస్ఎఫ్ కొత్తగూడెం కార్యదర్శిగా పనిచేస్తూ సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు. ఏడు సం. పాటు విద్యార్థి విభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2001లో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఏపీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యలు చేపట్టారు. పార్టీ అవసరాల నిమిత్తం 2002 లో కొత్తగూడెం పెట్టణ సిపిఐ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2005 నుండి 2010 వరకు కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన 2009-2017 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేశారు. 2017లో కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా పాల్వంచలో జరిగిన జిల్లా మహాసభల్లో తొలిసారి ఎంపికయ్యారు. రెండో సారు మణుగూరు మహా సభల్లో, అశ్వారావుపేటలో జరిగిన 3వ జిల్లా మహాసభలో మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంఏ సోషయాలజీ చదువుకున్న పాషా మొదటి నుండి వామపక్ష భావాజాలంతో ఉండే వారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు శాసన సభ్యునిగా విజయం సాధించడానికి కీలకపాత్ర పోషించారు. జిల్లాలో మంచి పట్టున్న నాయుకుడు కావడంతో మూడో సారి కూడా ఆయనకే పట్టం కట్టారు. ఇందులో భాగంగా పాషా మాట్లాడుతూ చిన్ననాటి నుండి వామపక్ష భావజాలంతో పెరిగిన తనను పార్టీ గుర్తించిందని, తనపై పెట్టిన పెద్ద బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పురోభివృద్ధి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు పాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

# వికలాంగులకు ఆరువేల పింఛన్ ఎక్కడ

- మెదక్ జిల్లా కేంద్రంలో సాయి బాలాజీగార్డెన్ లో వికలాంగుల జిల్లా సన్నాహక సభ



**జూలై 27 (సీ కే న్యూస్) చేగుంట :** చేగుంట మండల కేంద్రంలో గాంధీ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ జిల్లా వికలాంగుల పోరాట సమితి కోశాధికారి బాలయ్య మాట్లాడుతూ సోమవారం నాడు మెదక్ లోని బాలాజీ గార్డెన్ లో వికలాంగుల జిల్లా సన్నాహ క సభ నిర్వహించడం జరుగుతుందని తెలపడం జరిగింది. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్న వికలాంగులకు ఎన్నో విధాలుగా ప్రభుత్వ పరంగా వచ్చే విషయాల గురించి పోరాటం చేస్తూ ఉన్నాడు అందులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు అయిపోతుంది కానీ ఇప్పటివరకు వారు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు వికలాంగులకు 4000 నుండి 6000 ఇస్తామన్నారు. బీడీ కార్మికులకు వృద్ధులకు వితంతువులకు 2000 నుండి 4000 ఇస్తామన్నారు కానీ ఇప్పటివరకు నెరవేర్చలేదు అందువలన రేపు అనగా 28 సోమవారం నాడు మెదక్ జిల్లా కేంద్రంలోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ లో వికలాంగుల సన్నాహక సభ నిర్వహించడం జరుగుతుంది. కావున చేగుంట మండల కేంద్రంలో ఉన్న గ్రామాల్లోని ఉన్న వికలాంగులు, వితంతువులు, బీడీ కార్మికులు అందరూ తప్పనిసరిగా సభకు రావాలని పిలుపునివ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు, వివిధ గ్రామాల వికలాంగులు పాల్గొనడం జరిగినది.

# తుమ్మల ఆనంద్ కూతురు ఘనంగా వివాహ నిశ్చితార్థం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 27.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఆరూరు వాస్తవ్యులు తుమ్మల ఆనంద్ కూతురు కోమాలిక,ఎంగేజ్మెంట్ దేవి శ్రీ ఫంక్షన్ హాల్ లో జరిగింది ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు నరసయ్య గూడెం మాజీ సర్పంచ్ తుమ్మల దామోదర్, తుమ్మల నాగరాజు అడ్వకేట్ హైదరాబాద్, తుమ్మల శ్రీనివాస్ (గ ) తుమ్మల మురళి, తుమ్మల శ్రీనివాస్, అరూరు మాజీ సర్పంచ్ పోలేపాక చెమ్మయ్య, వలిగొండ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిలకమర్రి కనకాచారి, మత్స్యగిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్, సింగిల్ విండో డైరెక్టర్ ఆవుల స్వామి, ఆరూరు యాదవ సంఘం అధ్యక్షులు కసిర బోయిన లింగయ్య, తుమ్మల శ్రీధర్, రజక సంఘం అధ్యక్షులుఎలిమినేటి సంతోష్, ఎలిమినేటి వెంకటేష్, పాల్గొన్నారు,

# ఇందిరమ్మ ఇండ్లు చారిత్రాత్మక పథకం..





- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిది..
- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్) జూలై 27,**ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పాల్వంచలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్షలో జిల్లాల్లో వర్షాభావం, వరద ముంపు, సీజనల్ వ్యాధులు, ఎరువుల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీ, వనమహోత్సవ కార్యక్రమం, విద్యా రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దుర్శెట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు జిల్లాల ప్రస్తుత పరిస్థితులపై వివరాలు ఇచ్చారు.

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..:**

భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ తో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇందిరా సౌర జలవికాసం పథకం కింద ఈ రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్లు, ఉద్యానపంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు ఖర్చు చేసే ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల స్థలంలో నిర్మించాలని, ఈ పాఠశాలలు ఇతర విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వర్షాకాలంలో ప్రత్యేక దృష్టి అవసరమని, వైద్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా పేదల సంక్షేమానికి, పేదలను ఆర్థికంగా అభివృద్ధి పరచడానికే మహాలక్ష్మి పథకం, 500 కే గ్యాస్ బండ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు . భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామన్నారు. దీనికిగాను ప్రతి సోమవారం వారం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయడానికి గాను బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చేపపిల్లల పంపిణిలో ఈ సంవత్సరం ప్రయోగాత్మకంగా మహిళా సంఘాల ద్వారా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం ద్వారా వారిని అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ..**

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి పని చేయాలని అన్నారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, యూరియా తక్కువ ఉన్నట్టు తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపుతిప్పే కార్యక్రమమని అభివర్ణించారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ జాగ్రత్తలు పాటిస్తూ ప్రస్తుతం 110 ఎం ఎం చేప పిల్లలు పంపిణీ చేయడంతో పాటుగా, కౌంటింగ్ ప్రకారం అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువు గట్ల పైన చెరువు సామర్థ్యం, ఎన్ని చేప పిల్లలు పెంపకం చేపడుతున్నాం, వాటి యొక్క ఉత్పత్తి ఎక్కడ నుంచి మరియు వాటి ఖర్చు తదితర పూర్తి వివరాలు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు తో పాటు ప్రతి ఒక్క ఇంటి ఆవరణంలో ఐదు మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. .**

రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గత పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవన్న ఆయన, ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయడంపై కట్టుబడి ఉందన్నారు. వరదలు, వర్షాలకు సంబంధించి అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..**

అధికారులు ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుంచుకొని పనిచేయాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసుకుని పంపిణీ చేయు విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరిగేటట్లు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రతివారం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదవారి సంక్షేమం కోసం రూపొందించిన పథకం అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకోవలసిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధుల పైన ఉందన్నారు. పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని పెండింగ్ లో ఉన్న అన్ని పనులను త్వరితగతను పూర్తి చేయాలన్నారు. రహదారుల వెంట ఏర్పడిన గుంటలను పూడ్చాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అలా జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు. తీసుకోవాలన్నారు.ఆస్పత్రులు, వసతి గృహాలు పర్యవేక్షించడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి, ప్రతి నెల ఒక ప్రణాళిక ద్వారా ఆసుపత్రులు వసతి గృహాలు పరిశీలించి నివేదికలు అందచేయాలని ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, ఎస్పి రోహిత్ రాజు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ రోడు రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు



**జూలై 27 ( సీ కే న్యూస్) చేగుట్ట:** చేగుంట మండల కేంద్రంలో చేగుంట నుండి మెదక్ వేలె గల రహదారిలో రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 45 కోట్ల రూపాయలతో నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే, ఆగస్టు 2న రైల్వే మంత్రి భూమి పూజ చేయనున్నారు ఈనేపథ్యంలో, రైల్వే గేటు వద్ద గల స్థలాన్ని రైల్వే అధికారులతో కలిసి, ఆర్ అండ్ బి, ఈ ఈ లను, పార్టీ కార్యకర్తలతో కలిసి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జికి సంబంధించిన మ్యాపును పరిశీలించినారు.రైల్వే ఓవర్ బ్రిడ్జి పని మొదలుపెట్టిన తర్వాత అతి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ట్రాఫిక్ కి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని,పోలీస్ అధికారులకు తెలియజేశారు. చేగుంట నుంచి మెదక్ వెళ్లే వాహనాలకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సిపిఎం సాంబశివుడు, ఎ ఈ నథానియలు ఆర్ అండ్ బి ఈ ఇ సర్దార్ సింగ్,ఎ ఇ విజయ్ సారథి,మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు కరణం గణేష్ రవికుమార్,మాజీ అధ్యక్షుడు చింతల భూపాల్,దుబ్బాక నియోజకవర్గ కో కన్వీనర్ గోవింద్,మాజీ సర్పంచులు బాలచందర్,నాగభూషణం, ప్రవళిక బిక్షపతి,మాజీ యం పి.పి పాండు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది సుజాత,మండల మహిళ మోర్చ అధ్యక్షురాలు లావణ్య,టౌన్ ప్రెసిడెంట్ సాయి, జనరల్ సెక్రెటరీ సంతోష్ రెడ్డి, జడ్పిటిసి కన్వీనర్ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## జక్కంపూడి ప్రథమ వర్ధంతి సభలో పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాఘమయి దయానంద్





**తల్లాడ/ జులై 27 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** మండల పరిధి లో బిల్లుపాడు గ్రామానికి చెందిన జిల్లా నాయకులు దివంగత జక్కంపూడి కృష్ణమూర్తి ప్రేమ లతా దంపతులు మరణించి నేటికీ సంవత్సరం కాలం అవుతున్న సందర్భంగా తనయుడు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలోని బిల్లుపాడు గ్రామంలో ప్రథమ వర్ధంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయిదయానంద్ హాజరై జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జక్కంపూడి తో తనకున్న అనుబంధాన్ని మరొకసారి గుర్తు చేశారు ఎన్ని ఆటంకులు వచ్చినా ఎన్ని అవమానాలు ఎదురైన జక్కంపూడి తన గ్రామ అభివృద్ధి కోసం పని చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పదవి ఉన్నా లేకున్నా తనతో పాటు ఉంటూ మంచి నాయకుడిగా జక్కంపూడి ఎదిగారన్నారు. బిల్లుపాడు గ్రామ అభివృద్ధి కోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఈ సందర్భంగా తుమ్మల హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే రాఘమయి మాట్లాడుతూ తల్లాడ మండలంలో తన గెలుపులో జక్కంపూడి కీలక పాత్ర పోషించారన్నారు. అలాంటి నాయకున్ని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. బిల్లుపాడు అభివృద్ధి కోసం జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో అన్నివేళలా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

బిల్లుపాడు గ్రామంలో 12 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంగన్వాడి కొత్త భవనానికి శంకుస్థాపన చేశారు . ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాప సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతి రెడ్డి , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దీవెల కృష్ణయ్య, సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు అడప అనిల్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కిరణ్, మండల నాయకులు తుమ్మలపల్లి రమేష్ బీసీ సెల్ నాయకుడు రాఘవ, ఎస్సీ సెల్ నాయకులు వెంకటేశ్వర్లు తల్లాడ మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పారిశుద్ధ్యమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులు....

- కార్యక్రమంలో భాగస్వాములైన ఎండిఓ సురేష్ బాబు...



**తల్లాడ జులై 27 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** స్థానిక మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ఎక్కడికి ఎక్కడ లోతట్టు ప్రాంతాలలో మురుగునీరు చేరుకుంది ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆగిన వర్షపు నీటిని తొలగిస్తూ నీరు చేరుకున్న ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లిస్తూ దోమలు ఆ నీటి పైన గుడ్లు పెట్టకుండా దోమలు ప్రబలకుండా వ్యాధులు రాకుండా దానిపై పైరిత్రం అనే మందును చల్లి దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు.

గ్రామపంచాయతీ సెక్రటరీ కృష్ణారావు అడుగడుగునా సలహాలు ఇస్తూ ఆశా వర్కర్లను గ్రామపంచాయతీ సిబ్బందిని నిరంతర పర్యవేక్షణలో ఉంచి ఏ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితి నెలకొన్నది అనే సమాచారాన్ని తెలుసుకొని తగు చర్యలు చేపట్టారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీల పట్ల శాపంగా మారిన మోడీ ప్రభుత్వం.

- .వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణ కుమార్.
- కూలీలకు కొర్రీలతో సంక్షేమం ఎగనామం పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం.

**సి కె న్యూస్/తిరుమలాయపాలెం,జులై 27:**కూలీల కడుపు కొట్టి రాయితీల రూపంలో కార్పొరేట్ కంపెనీల ఖజానా నింపుతున్న మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులు ఏజెంట్ గా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణ కుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్ వ్యవసాయ కార్మిక సంఘం ఆఫీసులో తాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా సిద్ధిని కర్ణకుమార్ పాల్గొని మాట్లాడుతూ..వ్యవసాయ కూలీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు.వ్యవసాయంలో వాడే పెస్టిసైడ్స్ ఫెర్టిలైజర్స్ క్రిమిసంహారక మందుల వాడకం ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ కూలీలకు 50 సంవత్సరాలకే కళ్ళు కనిపించకుండా మెదడు మొద్దు బారి కండరాలు నరాల జబ్బులు రావడంతో 50 సంవత్సరాలకే వృద్ధాప్యం వస్తుందని వ్యవసాయ కూలీల ఆరోగ్య భద్రత ప్రమాద భీమా రేషన్ షాప్ ద్వారా నెలకు సరిపడా సరుకులు ఉచితంగా ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విడతల వారీగా కాకుండా ఒకేసారి ఇందిరమ్మ జాబితా అర్హులైన కూలీలందరికీ ఇవ్వాలని గ్రామాల్లో ప్రభుత్వ భూమి వ్యవసాయ కూలీలకు పంచాలని అర్హులైన వారందరికీ పింఛన్లు ఇవ్వాలని ఉపాధి హామీ తో పని లేకుండా ఆత్మీయ భరోసా అర్హులైన కూలీలందరికీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీలు,సంక్షేమం పేద ప్రజలకు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో కలెక్టరేట్ ముట్టడి మంత్రుల కార్యాలయాలు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు కంపసాటి వెంకన్న. మేళ్లచెరువు వీరబాబు. పిట్టల రాంబాబు. సింగారపు సత్యనారాయణ. గోగుల ఆది జిల్లా నాగరాజు. మదారి ఈశ్వరమ్మ లు పాల్గొన్నారు.




# అన్నా రండి...! హార్టీ వెల్కమ్....!!

**తన క్యాంపు కార్యాలయానికి తొలిసారి విచ్చేసిన వాకిటికి ఘనస్వాగతం పలికిన పొంగులేటి**



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం : అన్నా రండి...! హార్టీ వెల్కమ్...!! అంటూ తొలిసారి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన తెలంగాణ పశుసంవర్ధక శాఖ మంత్రి, ఉమ్మడి ఖమ్మంజిల్లా ఇన్ చార్జి మంత్రిగా ఉన్న వాకిటి శ్రీహరికి తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఘనస్వాగతం పలికారు. కొత్తగూడెం నియోజకవర్గ పర్యటనను ముగించుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళు_న్న వాకిటి శ్రీహరిని తన క్యాంపు కార్యాలయానికి రావాలని మంత్రి పొంగులేటి ఆహ్వానించారు. తన ఆహ్వానం మేరకు విచ్చేసిన వాకిటికి శాలువా కప్పి మెమోంటోతో ఘనంగా పొంగులేటి సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా విశేషాలు మంత్రి పొంగులేటి శ్రీహరికి వివరించారు. పొంగులేటి ఆతిథ్యాన్ని స్వీకరించిన శ్రీహరి శీనన్న ఆతిథ్యం బేష్ అని కితాబిచ్చారు.

## చిన్నారి మహితా రెడ్డిని ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు..



తల్లాడ జులై 27 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్: తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ వీడీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ జోనల్ చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి, లలిత కుమారి దంపతుల మనవరాలు (దగ్గుల ఉమేష్ రెడ్డి, సింధు దంపతుల కుమార్తె) మహితా రెడ్డి అన్నప్రాసన వేడుక ఆదివారం తల్లాడలోని వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీర మోహన్ రెడ్డి హాజరై చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు జివిఆర్, దగ్గుల నాగిరెడ్డి, కిషోర్ రెడ్డి, తేల్లూరి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## జక్కంపూడి కి నివాళులర్పించిన మండల నాయకులు సరికొండ అప్పలరాజు




తల్లాడ/ జులై 27 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:
మండల పరిధి లో బిల్లుపాడు గ్రామానికి చెందిన జిల్లా నాయకులు దివంగత జక్కంపూడి కృష్ణమూర్తి ప్రేమ లతా దంపతులు మరణించి నేటికీ సంవత్సరం కాలం అవుతున్న సందర్భంగా తనయుడు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలోని బిల్లుపాడు గ్రామంలో ప్రథమ వర్ధంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సరికొండ అప్పలరాజు హాజరై జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి తో తనకున్న అనుబంధాన్ని ఒకసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## డా:అమ్మిన కు రాష్ట్రస్థాయి అమరవాది సాహితీ పురస్కారం



సికే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి: షేక్ రహీమ్:వాజేడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు ప్రముఖ రచయిత డా అమ్మిన శ్రీనివాస రాజు కి ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అమరవాది బాలసాహిత్య పురస్కారం ప్రధానం చేశారు, మూడు దశాబ్దాలుగా ఆయన సాహిత్యం కోసం చేస్తున్న కృషికి గాను ఈ సత్కారం చేశారు,పురస్కారం గా 5000 వేల రూపాయల నగదు జ్ఞాపిక, శాలువాతో ముఖ్య అతిథి డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, అధ్యక్షులు డాక్టర్ అమరవాది నీరజ, డాక్టర్ పత్తిపాక మోహన్, సత్కరించారు, ఈ కార్యక్రమంలో మరొక పురస్కార గ్రహీత శ్రీమతి శీలా సుభద్రా దేవి మాడభూషి లలితాదేవి, కొరిగింజ రామచంద్రయ్య, ఎల్గటి తిరుపతిరెడ్డి, డా:హారిక, అమ్మిన అనురాధ కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## సాయి మందిరాన్ని సందర్శించిన సినీ డైరెక్టర్ బోయపాటి.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 27,జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరాన్ని సినీ దర్శకుడు బోయపాటి శ్రీను ఆదివారం నాడు సందర్శించారు. ఆలయ అధ్యక్షులు కొమ్మనాపల్లి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి అబ్బినేని శ్రీనివాసరావు, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు వారికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించి బాబా వారి చిత్రపటాన్ని అందించారు. అర్చకులు వారి పేరుతో గోత్రనామాలతో అర్చన ఆశీర్వచనం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు మరియు వల్లభనేని చందు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్: పొంగులేటి



సికె న్యూస్ ప్రతినిధి
తెలంగాణ : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఫిర్యాదులు, సందేహాలు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ లోని హౌసింగ్ కార్యాలయంలో త్వరలో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. సీఎం రేవంత్ సూచనల ప్రకారం స్థానిక శాసనసభ్యులను భాగస్వామ్యం చేసి ప్రతి మండలంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా కూడా వాటిని పరిశీలించాలన్నారు.

## భీమా నాయక్ ఇంటికి ప్రముఖ సామాజిక ఉద్యమ నేత బహుజన కళాకారుడు రెంజర్ల రాజేష్ భేటీ.........



- సుదీర్ఘంగా రెండు గంటల పాటు చర్చలు జరిపిన రెంజర్ల రాజేష్ గారు.....
- తెలంగాణ రాష్ట్రంలో బలమైన బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా కలిసి పోరాటాలు చేస్తామని స్పష్టం......
- ఉద్యమ కుటుంబాన్ని మెచ్చుకున్న రెంజర్ల రాజేష్.......
- బాబా సాహెబ్ అంబేద్కర్ కలలు కన్నా సమాజాన్ని నిర్మిద్దాం....

సి కె న్యూస్ ప్రతినిధి మహబూబాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో బలమైన బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడమే ముందున్న లక్ష్యం అని ఆదివారం ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్ ఇంట్లో రెంజర్ల రాజేష్ భేటీ అయి మాట్లాడారు.......ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని,బహుజనులంతా ఒక్కటి అవ్వాలని తెలిపారు... పవాస అంబేద్కర్ కలలు కన్న సమాజాన్ని నిర్మించడం కోసం కలిసి పని చేద్దామని అన్నారు.... ఏ ప్రభుత్వాలు వచ్చినా దళిత గిరిజనులపై దాడులు ఆపడం లేదని, రాష్ట్రంలో రోజురోజుకు పరువు హత్యలు పెరిగిపోయాయని అందుకోసం కులమతాలు లేని నవ సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు....అనంతరం గుగులోతు భీమా నాయక్ కుటుంబం చేస్తున్న సామాజిక ఉద్యమాలను చూసి ఉద్యమ కుటుంబాన్ని మెచ్చుకున్నారు...ఈ కార్యక్రమంలో భీమా నాయక్ పెద్ద కుమారుడు శివ వర్మ,కళాకారుడు జంగం ఉప్పలయ్య,ఎల్ హెచ్ పి యస్ నేతలు రామదాసు నాయక్,సోమోజి నాయక్,జవహర్ లాల్,రమేష్ లు వున్నారు

## పైసా ఖర్చు లేకుండా వైద్యం అందించండి...!

- వైరారోడ్డులో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న కారు
- నలుగురు యువకులకు తీవ్రగాయాలు
- కాన్వాయ్ లో క్యాంపు కార్యాలయానికి వస్తు ఘటనను చూసి ఆగిన మంత్రి పొంగులేటి
- అధైర్యపడొద్దు... నేనున్నానని భరోసా
- వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించాలని ట్రాఫిక్ సీఐ సాంబశివరావుకు ఆదేశాలు



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం : ఆపదలోనూ నేనున్నా అని మరోమారు చాటుకున్నారు తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి .... వైరారోడ్డులోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు ఢీకొన్న ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. ఇదే సమయంలో కొత్తగూడెం నియోజవకర్గ పర్యటనను ముగించుకుని ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయానికి వస్తున్న మంత్రి పొంగులేటి ఆ ఘటనను చూసి కాన్వాయ్ ను ఆపారు. అధైర్యపడొద్దని.... నేనున్నానని ప్రమాదంలో గాయపడిన యువకులకు భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న ట్రాఫిక్ సీఐ సాంబశివరావును దగ్గరకు పిలిచి క్షతగాత్రులను త్వరగా కిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా వైద్యులను ఆదేశించారు.

## పాత పాల్వంచ మైసమ్మ తల్లి దేవాలయంలో ఘనంగా శ్రావణ మాస బోనాలు.

- పూజల్లో పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల దంపతులు.
- పల్లకి మోసి, బోనమెత్తిన కొత్వాల - వివిధ దేవాలయాల నుండి అమ్మవారికి చీరె - సారె.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 27,పాత పాల్వంచ గడియకట్ట లోని పేరొందిన మైసమ్మ తల్లి దేవాలయంలో శ్రావణ మాసము మొదటి ఆదివారం బోనాలు ఘనంగా జరిపారు. ఆదివారం ఉదయం నుండే ఆలయ పూజారి పురాణం పవన్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు సతీమణి విమలా దేవి దంపతులు పూజలు చేశారు.

**పాత పాల్వంచ దేవాలయాల నుండి అమ్మవారికి చీరె - సారె**

మైసమ్మ తల్లి బోనాలు సందర్భంగా పాత పాల్వంచ లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, షిర్డీ సాయి బాబా దేవాలయాల నుండి పూజారులు కందాల ఆనంద కుమారాచార్యులు, దినకరశాస్త్రి, సతీష్ కుమార్‌లి ల ఆధ్వర్యంలో అమ్మ వారికి చీరె - సారె సమర్పించారు.
పల్లకి మోసి బోనమెత్తిన కొత్వాల : శ్రావణమాసపుబోనాల సందర్భంగా పాత పాల్వంచ మహిళలతో కలిసి డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు. అమ్మవారి పల్లకి మోసారు. బోనమెత్తుకుని అమ్మవారికి సమర్పించారు.
ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ క్రాంతి మురారి, మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, కమిటీ సభ్యులు వంగా రమేష్, మసనం శరత్, కోసూరి కిరణ్ కుమార్, రౌతు మల్లేష్, కరుకుల సతీష్, గడదాసి వెంకటేష్, ముత్యాల కోటేశ్వరరావు, అగ్నిమండల భాస్కర్, బర్ల పాపారావు, గుగులోత్ మంగ్యానాయక్, పాశం నాసరయ్య, బొందిల శేషగిరి రావు, ఎనగందుల సాంబయ్య, కిలారి భవానీశంకర్, బట్టు లింగయ్య, నర్శిరెడ్డి, శంకర్ రెడ్డి, మణికంఠ, భాగం రాంబాయమ్మ, లక్ష్మణ్, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, పైడిపల్లి మహేష్, కందుకూరి రాము, ఉండేటి శాంతి వర్ధన్, చిన్నపండులి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 29న ఖమ్మంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుని పర్యటన

- పర్యటనను విజయవంతం చేయండి
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి పిలుపు



సి కె న్యూస్ ప్రతినిధి:భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రామచంద్ర రావు ఈనెల 29వ తేదీన ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారనీ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు తెలియజేశారు. ఆదివారం నాడు జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పర్యటన వివరాలు వెల్లడించారు. ఇందులో భాగంగా 29 న ఉదయం 8 గంటలకు జిల్లా సరిహద్దులోని నాయకన్ గూడెం టోల్ ప్లాజా వద్ద వారికి జిల్లా భాజాపా శ్రేణులు స్వాగతం పలుకుతారు. అక్కడనుండి కూసుమంచిలోని శివాలయం కు 9 గంటలకు చేరుకొని పూజా కార్యక్రమం లో పాల్గొంటారు. ఖమ్మం నగరంలోని కాల్వడ్డు నుండి 10 గంటలకు నిర్వహించే బైక్ ర్యాలీ లో పాల్గొంటారు. అనంతరం ఖమ్మం నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్ లో 11 గంటలకు నిర్వహించే పబ్లిక్ మీటింగ్లో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరంలోని సూర్య తేజ హోటల్లో మేధావులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు నెల్లూరి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.

## రేషన్ కార్డులు పంపిణీ చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి



సి కే న్యూస్:గూడూరు మండలంలో ఆదివారం రోజున రేషన్ కార్డుల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేసిన మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్ వారితోపాటు గూడూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి మండల నాయకులు ఎండి హుస్సేన్ షాజహాన్ భువనేశ్వర్ పత్యం వెంకన్న గుండమల్ల నరసింహ దోమ ఉపేందర్ కురింద కళ్యాణ్ బేతం లక్ష్మీనారాయణ బెజ్జం మధుకర్ చదువల శాకమ్మ బొల్లెపల్లి పద్మ బొల్లంపల్లి జోష్న కత్తి అశోక్ కత్తి భానుమతి భాను రామన్ సత్యం ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ స్వామి అమ్మవార్ల పల్లకి ఉత్సవం

శ్రీశైలం దేవస్థానం సి కే న్యూస్:లోక కళ్యాణం కోసం దేవస్థానం ఈరోజు(27.07.2025) రాత్రి శ్రీ స్వామి అమ్మవార్లకు పల్లకి ఉత్సవం నిర్వహిస్తోంది. ఈ పల్లకి ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో దేవస్థానం సేవగా (సర్కారీ సేవగా) జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ, అర్చక స్వాములు సేవా సంకల్పాన్ని పటిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించబడుతుంది. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో వేం చెబు చేహింది శాస్త్రోక్తంగా షాడో సోపచార పూజలు జరిపించబడుతాయి. ఆ తరువాత పల్లకి ఉత్సవం జరిపించబడుతుంది.

## పెద్ద వంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కుమ్మరి రామ్మూర్తి





సి కే న్యూస్:పెద్దవంగరలోని సాయి గార్డెన్లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పలు అంశాలపై చర్చించిన విలేకరులు పాత మండల కమిటీని రద్దుచేసి నూతన ప్రెస్ క్లబ్ కమిటీని గౌరవ అధ్యక్షుడు పల్లపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. పెద్దవంగర ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కుమ్మరి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడిగా రాయారపు రాజు, ప్రధాన కార్యదర్శిగా తులసి వేణు, కోశాధికారిగా జలగం శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కుమ్మరి రామ్మూర్తి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని, జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా కృషి చేస్తానన్నారు. మిత్రుల సహకారంతో కలంతో పత్రికా రంగానికి మంచి పేరు తీసుక వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గుల్లపల్లి సదానందం, పానుగోతు బాలాజీ, కందుల శ్రీశైలం, సుధా గాని యాకన్న, గంగారపు మధు, చింతల ఐలయ్య, గుండెపుడి చైతన్య శర్మ, మల్లేష్ మొదలగు వారు పాల్గొన్నారు

## అర్చకుని ఆత్మహత్యపై విచారణ జరిపించాలి.

సి కే న్యూస్:కర్నూలు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో ఉప ప్రధాన అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న పూజన్న ఆత్మహత్యపై విచారణ జరిపించి. ఆత్మహత్యకు బాధ్యులైన ఈవో విజయ రాజు ప్రధాన అర్చకుడుఈరప్ప వేద పండిత్ మోహన్ శర్మలపై సమగ్ర విచారణ జరిపించాలని బిజెపి సీనియర్ నేత జంగం వీరయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న పూజన్న తనఆత్మహత్యకు ఆలయ సిబ్బంది కారణమని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు .మృతుని కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాల ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు .ఆత్మహత్యకు కారణమైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో జిల్లాలోని అర్చక సంఘాలతో కలుపుకొని ఉద్యమిస్తామన్నారు.ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తా చాటాలి...

- రాష్ట్రంలో అధికారమే లక్ష్యం..!
- బీఆర్ఎస్ ను జనం మరిచిపోయారు...
- తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్...
- బీజేపీనే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు...
- మా పార్టీలో ఎలాంటి విభేదాలూ లేవు...
- అందరం కలిసికట్టుగా ముందుకెళ్తాం...
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



పెబ్బేరు జూలై27 (సి కే న్యూస్)రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలే తమ తొలి లక్ష్యమని బీజేపీ తెలంగాణ శాఖ నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు.వచ్చే శాసనసభ ఎన్నికల్లో అధికార పీఠాన్ని కైవసం చేసుకోవడమే అంతిమ లక్ష్యమని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం పెబ్బేరు పట్టణానికి చేరుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా మొట్టమొదటిసారిగా పెబ్బేరు పట్టణానికి విచ్చేసినందుకు పెబ్బేరు మండల బిజెపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు.ముందుగా సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తదనంతరం ఆయన మాట్లాడుతూ...బీజేపీ సిద్ధాంతాలు, మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని చెప్పారు.తెలంగాణలో తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెసేనని తేల్చిచెప్పారు.బీఆర్ఎస్ తమకు ఏ దశలోనూ పోటీ కాదన్నారు.పార్టీలో సీనియర్ నాయకుల సలహాలు, సూచనలతో కలిసికట్టుగా ముందుకు వెళ్తానని తెలిపారు.పార్టీ కేంద్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి,వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ధీమా వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తా చాటాలని, కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రజలలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని కార్యకర్తలు అకుంఠిత దీక్షతో పనిచేయాలని,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జీ భరత్,బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పురుషోత్తం రెడ్డి,వేమారెడ్డి, బిజెపి మండల రూరల్ అధ్యక్షులు నాగరాజ్ యాదవ్,శ్రీరంగాపురం బిజెపి మండల అధ్యక్షులు విష్ణువర్ధన్,క్రాంతి, వెంకట్రామిరెడ్డి,శ్రీనివాస్ గౌడ్,రంగ గౌడ్,ఆంజనేయులు,రామకృష్ణ,అరవింద్,శివ,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్ గుంతలమయం



సంగారెడ్డి జిల్లా, బ్యూరో చీఫ్, సి కే న్యూస్ నిత్యం జనాలు వస్తు పోయే రోడ్ పూర్తిగా వర్షంతో క్షీణించి గుంతలమయంగా తయారయింది. సంగారెడ్డి మున్సిపాలిటీలో ని 12 వార్డు ప్రగతి నగర్, ఒడి ఎఫ్ థర్డ్ వెంచర్ నుండి ద్వారక నగర్ వెళ్లే రోడ్డు గుంతలా మాయం అయ్యి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహన దారులు గుంతల్లో పడి ప్రమాదలకు గురై గాయల పలువుతున్నారని కాలనీ వాసులు బాధను వ్యక్తం చేశారు. గత 15 ఏండ్లుగా అభివృద్ధి నోచుకోక మట్టి రోడ్ తో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని, కాలనిలో కట్టిన ఇండ్ల కు భవన నిర్మాణ అనుమతుల కోసం లక్ష ల రూపాయలు ఫీజులు కట్టి ఇండ్లు నిర్మించుకుంటే ఈ కాలనిలో కనీస రోడ్డువసతి కూడా అభివృద్ధి జరుగలేదని, ప్రభుత్వ జిల్లా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ప్రగతి నగర్ నుండి ద్వారక నగర్ వెళ్లే రోడ్డు ను అభివృద్ధి పర్చాలని స్థానిక కాలనీ సంక్షేమ సంఘం నాయకులు స్వామి పీర్యా నాయక్ రాజు, తదితరులు కోరారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి బోనాలు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సి కే న్యూస్తెలంగాణ ప్రజల ఆత్మీయ పండుగ బోనాల జాతరను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండల్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ అయ్యప్ప కాలనీ పరిధిలో జూలై 27 (ఆదివారం) రోజు న ఘనంగా, ప్రశాంతమైన వాతావరణంలో ఉదయం ఐదు గంటల నుండి బోనాలు అమ్మవారికి సమర్పించడం జరిగింది. అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని. శ్రావణమాసం మొదటి వారంలో అంబేద్కర్ నగర్ లో బోనాల జాతరలో భాగంగా 5వ డివిజన్ అయ్యప్ప కాలనీలో ఉదయం కాలనీ పెద్దలచే కాలనీవాసులు అందరూ కలసి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు బోనాల పండుగ సందర్భంగా అంగరంగ వైభవంగా కాలనీవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. స్థానిక ప్రజలు కాలనీలు వాసులు ,గ్రామ దేవతల పట్ల భక్తి శ్రద్ధలతో , గ్రామ సంస్కృతి పట్ల గౌరవం కలిగించే ఈ ఉత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఐక్యంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

## మదినిండిన అభిమానం తో రంగయ్య దంపతులు రక్తదానం..

- బీవీ మోహన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని తమ అభిమానాన్ని
- చాటుకున్న విజయలక్ష్మి దంపతులు.
- స్వర్గీయ బీవీ మోహన్ రెడ్డిలాంటి నాయకుడికి కోసం రక్తం కాదు.
- ప్రాణదానం ఇచ్చిన తక్కువే-విజయలక్ష్మి.
- స్వర్గీయ బీవీ మోహన్ రెడ్డి కి ఘనమైన నివాళి.

ఎమ్మిగనూరు టౌన్, సి కే న్యూస్:యమ్మిగనూరు నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనగేశ్వరెడ్డి అధ్యక్షతన కీర్తిశేషులు బీవీ మోహన్ రెడ్డి పదమూడవ వర్ధంతి లో వందలాదిమంది అభిమానులు ఘనంగా నివాళి అర్పించి అభిమానం చాటుకున్నారు. అందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి లో జయనగేశ్వరెడ్డి తో పాటు పేదలకు రోగులకు పాలు పళ్ళు బ్రేడ్ లు పంచిన అనంతరం బీవీ మోహన్ రెడ్డి గారి పై అభిమానం తో స్థానిక మహాత్మా గాంధీ బ్లెడ్ బ్యాంకు లో విజయలక్ష్మి, సి. రంగయ్య దంపతులు ఇద్దరు రక్తదానం చేసి బివి కుటుంబం పై ఉన్న తమ అభిమానంను చాటుకున్నారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ అలాంటి నాయకుడి కోసం రక్తం దానం కాదు ప్రాణదానం ఇచ్చిన తక్కువేనని అయన ఋణం యమ్మిగనూరు ప్రజలు తీర్చుకోలేనిదని తెలిపారు. ఈరోజు రాజకీయం అయినా అభివృద్ధి అయిన, సంక్షేమం అయిన, రాష్ట్రం మొత్తం యమ్మిగనూరు వైపు చూస్తుంది అంటే అది స్వర్గీయ బీవీ మోహన్ రెడ్డి కృషి, ఎమ్మెల్యే బీవీ జయనగేశ్వరెడ్డి పట్టుదల అని తెలిపారు. ప్రస్తుతం మా ఎమ్మెల్యే జయనగేశ్వరెడ్డి పాలనా తండ్రి పాలనను గుర్తు చేస్తూ ఉందని బివి మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రజల సమస్య ల పై అనునిత్యం స్పందిస్తూ, గొప్ప ప్రజానాయకుడిగా ఎదుగుతున్నందుకు మాకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.వేలాది మంది అభిమానులను సంపాదించుకోవడం బీవీ కుటుంబం కి మాత్రమే సాధ్యమని విజయలక్ష్మి తెలిపారు.ఆ కుటుంబం కోసం చివరి రక్తపు బొట్టు వరకు అండగా ఉంటామని విజయలక్ష్మి తెలిపారు.కార్యక్రమం లో టీడీపీ నాయకులు యువత పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి



సి కే న్యూస్:గూడూరు మండలంలోని ఆదివారం రోజున అయినవోలు శ్రీధర్ కుమార్తె ఓడి నింపుట నూతన వస్త్ర పుష్పలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన గూడూరు మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ గూడూరు మండల బిఆర్ఎస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు బోడ ఎల్లయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## కుమ్మర్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి-దరిపల్లి ప్రవీణ్ కుమార్



చౌటుప్పల్. సి కే న్యూస్:కుమ్మర్లు ఆర్థికంగా, విద్య, వైద్య, రాజకీయ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కుమ్మర సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కన్వీనర్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం కో కన్వీనర్ గోపాల్ ఇతర సభ్యులతో కలిసి చౌటుప్పల్ మండలం నూతన కమిటీ ఏర్పాటు కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దేవాలయాల్లో కుమ్మర్లను పూజారిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మర్లను కులం బీసీ-బి నుండి బీసీ-ఏ లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మర్లకు పింఛన్లు అందించాలని కోరారు. కుండలు తయారు చేసే మట్టిని ఉచితంగా వారికి అందించాలని కోరారు. నూతన కమిటీ ఏర్పాటును శుక్రవారం ఆగస్ట్ ఒకటో తారీకు చౌటుప్పల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో చౌటుప్పల్ మండల కేంద్రంలోని వివిధ గ్రామాల కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ లో సభ్యులుగా కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడూరి డిసిఎం ఆంజనేయులు, చినగారి బలరాం, సత్యనారాయణ, గుమ్మడల్లి భాస్కర్, సిలివేరు శ్రీనివాస్, చిన్న కొండూరు మాజీ ఉప సర్పంచ్ తీగుళ్ళ చంద్రయ్య, తీగుళ్ల నరసింహ, సిలివేరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# పవన్ సర్వేలో అదే తేలిందా? ఇలాగయితే కష్టమేనా?

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే నెల నుంచి పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టనున్నారు. పదవులపైన కూడా క్లారిటీ ఇచ్చే అవకాశముంది. పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల విషయంలోనూ జనసేనాని కొంత కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఇన్నాళ్లు సినిమా షూటింగ్ లలో బిజీగా ఉన్న పవన్ కల్యాణ్ ఇక పార్టీకి 2014 నాటి హైప్ తెచ్చే ప్రయత్నంలో ఉన్నారట. ఇందుకోసం అనేక నియోజకవర్గాలలో సర్వేలు కూడా చేయిస్తున్నారు. తమకు పట్టున్న జిల్లాల్లో కొంత పార్టీని మరింత బలోపేతం చేసిన తర్వాత మిగిలిన నియోజకవర్గాలకు పార్టీని విస్తరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. పవన్ కల్యాణ్ తన ఇమేజ్ ఏ మాత్రం తగ్గకుండా చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్న ప్రయత్నంలో ఉన్నారు.

**ప్రభుత్వ నిర్ణయాలను...**

అవసరమైతే ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడానికి కూడా సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఇటీవల మీడియాలకు ఇంటర్వ్యూలు ఇస్తూ కూటమిలో అన్ని పార్టీలు సమన్వయంతో కలసి పనిచేస్తున్నాయని చెప్పిన పవన్ కల్యాణ్ రాజధాని అమరావతి భూములు అదనంగా సేకరించే విషయంలో మాత్రం తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టేశారు. రాజధానికి అదనపు భూమిని ఇవ్వడంలో బలవంతం ఏమీ లేదని, ఇష్టపూర్వకంగా ఇస్తేనే ప్రభుత్వం తీసుకుంటుందని, బలవంతంగా మాత్రం తీసుకోదని ప్రభుత్వం తరుపున చెప్పారంటే ఆయన అదనపు భూ సేకరణను వ్యతిరేకించినట్లే కనపడుతుంది. రాజధాని రైతుల్లో నెలకొన్న అసంతృప్తిని ఆయన గమనించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తుంది.

**ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను...**

జనసేన ఎమ్మెల్యేలతో పాటు కూటమి పార్టీల్లోని ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను కూడా ఆయన పసిగట్టినట్లు సమాచారం. స్థానికంగా సమస్యలను పరిష్కరించలేకపోతుండటంతో నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేల పనితీరు పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. జనసేనకు చెందిన ఇరవై మంది ఎమ్మెల్యేల్లో దాదాపు పదిహేను మంది ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు సర్వే ద్వారా తేలడంతో వారిని పిలిచి క్లాస్ పీకేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. త్వరలోనే ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రానున్న నాలుగేళ్ల పాటు కష్టపడి పనిచేసి మంచి మార్కులు తెచ్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు దక్కవన్న హెచ్చరికలు కూడా పవన్ జారీ చేసే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద ఆగస్టు నెలలో ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చే అవకాశముంది.

# నకిలీ పుచ్చకాయను గుర్తించడం ఎలా...

వేసవి దగ్గరకు వచ్చింది. ఈ సీజన్‌లో ఎక్కువ డిమాండ్ ఉండేది పుచ్చకాయలకు. అయితే వీటికి రంగు రావడానికి కొన్ని రసాయనాలు కలుపుతూ ఉంటారు. వాటిని గుర్తించాలి. ఇలాంటి పుచ్చకాయ తింటే ఆరోగ్యమేమో కాని... అనారోగ్యం మాత్రం తప్పక వస్తుంది. మరి రసాయనాలు కలిపిన పుచ్చకాయను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. . . .
పుచ్చకాయను చూస్తే నోరూరుతుంది. అలాగే పుచ్చకాయ పండు ఆరోగ్యానికి చాలా మంచిది. శరీరంలో ఎర్ర రక్త కణాలను పెంచుతుంది. నీటి శాతాన్ని నిర్వహిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడుతుంది, గుండె ఆరోగ్యానికి మంచిది, కళ్లకు మంచిది, వీటిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. వేసవిలో తప్పకుండా తినాల్సిన వాటిలో ఒకటి ఇది. మార్కెట్‌లో లభించే అన్ని పుచ్చకాయలు మంచివే అని చెప్పలేం. అవి త్వరగా పండేందుకు వాటిలో రసాయనాలు కలుపుతూ ఉంటారు. పుచ్చకాయలు త్వరగా చెడిపోకుండా ఉండేందుకు, లోపలి భాగం ఎరుపు రంగులో ఉండాలని వివిధ కారణాలతో పుచ్చకాయలకు రసాయనాలు కలుపుతారు. ఆ పండ్లు చూసినప్పుడు చాలా ఎర్రగా ఉంటాయి. కానీ రుచి మాత్రం ఉండదు. పండును తియ్యగా చేసేందుకు రసాయనాలు కూడా ఉపయోగిస్తారు. ఇలాంటి పండ్లు ఆరోగ్యానికి చాలా హానికరం.

సూదితో పొడిచిన రంధ్రం

సాధారణంగా పండ్లను సరిగా పరిశీలిస్తే అందులో కెమికల్ కలిపారో లేదో అర్థం చేసుకోవచ్చు. నిశితంగా పరిశీలిస్తే మీకే తెలుస్తుంది. పుచ్చకాయలో సూదితో పొడిచిన చిన్న రంధ్రం ఉంటుంది. అమ్మేవారిని అడిగితే ఈ విషయం ఒప్పుకోరు. ఇలాంటి పండ్లు కొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోకండి.పండ్లు త్వరగా పక్వానికి రావడానికి కార్బైడ్‌ను కలుపుతారు. ఇది ఇథనాల్ వాయువును ఉత్పత్తి చేస్తుంది. దీని ఫలితంగా పండ్లు త్వరగా పండుతాయి. త్వరగా పక్వానికి రావడానికి, రంగు వచ్చేలా చేయడానికి సుడాన్ రెడ్, మిథనాల్ ఎల్లో, మెర్క్యూరీ క్రోమేట్ వంటి రసాయనాలను కూడా ఉపయోగిస్తారని ఆహార నిపుణులు చెబుతున్నారు.




**రసాయనాలు ఇంజెక్ట్ చేస్తారు**

పుచ్చకాయలను కొందరు ఎర్లీగానే కట్ చేసి తీసుకొస్తారు. దానిలో రసాయనాలను ఇంజెక్ట్ చేస్తారు. అయితే ఇలా చేసినప్పుడు గుజ్జు పగిలిపోయి రంగులో తేడా ఉంటుంది. కోసినప్పుడు విడిపోతే ఆ పుచ్చకాయలో కెమికల్ కంటెంట్ ఉందని చెప్పొచ్చు. కొన్నిసార్లు మనం పుచ్చకాయను కోస్తుంటే గుజ్జులో తేడా కనిపిస్తుంది. కింద పడుతూ ఉంటుంది. అది సరైనది కాదని అర్థం.

**తెల్లటి మచ్చలు కనిపిస్తే..**

పుచ్చకాయ పండ్లపై తెల్లటి మచ్చలు కనిపిస్తే, అలాంటి పండ్లపై రసాయనాలు స్ప్రే చేసినట్లు భావించవచ్చు. వాటిని చేతులతో తాకగానే పౌడర్ చేతులకు అంటుకుంటుంది. అలాంటి పండ్లను కొనకండి. త్వరగా పండేందుకు ఇలాంటి కెమికల్స్ వాడుతారు. ఆరోగ్యానికి మంచిది కాదు.పుచ్చకాయ బాగా పండాలి. కానీ కాయలుగా ఉన్నప్పుడే వాటిని తీసుకొచ్చి కొందరు రసాయనాలు కలుపుతారు. దీంతో పండిన పుచ్చకాయ గింజలు చాలా చిన్నవిగా ఉండాయి. అదే సహజంగా పండిన పుచ్చకాయ పండ్ల గింజలు నల్లగా ఉంటాయి..., పెద్దగా ఉంటాయి.

**శరీరంపై దుష్ప్రభావాలు**

కార్బైడ్‌తో చేసిన పండ్లను తినడం వల్ల కాలేయం, మూత్రపిండాల
ఆరోగ్యం దెబ్బతింటుంది. మిథనాల్ కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. క్రోమేట్ కడుపు సమస్యలు, రక్తహీనత, మెదడు దెబ్బతినడం, సంతానోత్పత్తి తగ్గడం వంటి సమస్యలను కలిగిస్తుంది. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పండ్లను తింటాం. కానీ మనం తినే పండ్లు శరీరానికి హాని కలిగించే అవకాశం ఉంది. ఎందుకంటే లాభం కోసం పండ్లపై రసాయనాలు వాడుతున్నారు. రసాయన రహిత పండ్లు తినడం మాత్రమే ఆరోగ్యానికి మంచిది. పుచ్చకాయ కొనేటప్పుడు పైన చెప్పిన విషయాలను గుర్తుంచుకోండి



# లైట్ బీరు తాగితే.. గుండె జబ్బులు రావంట.. కిడ్నీలో రాళ్లు ఉండవంట..!

బీర్.. ఆ పేరు వినగానే ఉత్సాహం ఉరకలేస్తుంది కదూ.. అసలే ఎండాకాలం.. చిల్డ్ బీర్ కొడితే ఎంత బాగుండో అనిపిస్తోంది కదా.. బీర్ చాలా ఏళ్లుగా ఎక్కువమంది.. ముఖ్యంగా యువత ఇష్ట పడే మద్యం. పండుగలు, బెస్ట్ ఫ్రెండ్స్ కలిసినప్పుడు.. లేదా అప్పుడప్పుడు ఒంటరిగా కూడా యూత్ బీర్ కొడుతుంటారు.అయితే మద్యం ఆరోగ్యం హానికరం అని అంటుంటారు. కానీ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే బీర్ ఆరోగ్యానికి హానికం కాదట. మనం నమ్మకాలకు విరుద్ధంగా బీర్ కూడా మంచి ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుందట. బీర్ ను అతిగా వాడకుండా.. ఒక గ్లాసు బీర్ తో జీవితాన్ని సులభంగా, ఆనందంగా గడపడానికి సాయపడుతుందట.

బీర్ తయారీలో ఈస్ట్, హాప్ లు, తృణధాన్యాలతో తయారు చేయడం, వాటిని పులియ బెట్టడం ద్వారా బీర్ తయారు చేస్తారు. ఒక బీర్ క్యాన్ లో ఆల్కహాల్ గాఢతన 4-6 శాతం మాత్రమే ఉంటుంది. ఇందులో 40శాతం వరకు పోషకాలు గల పానియం ఉంటుంది. దీనిలో ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. బీర్ మితంగా వినియోగించినప్పుడు ఆరోగ్యానికి సహాయపడుతుంది బేవరేజెస్ కంపెనీ ప్రతినిధులు చెప్పారు. బీర్ తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలను తెలుసుకుందాం..

**గుండెకు ఆరోగ్యాన్ని..**

బీర్ అనేది గుండెకు ఆరోగ్య కరమైన ఆల్కహాలిక్ పానియం. బీర్ తీసుకోని వారితో పోలిస్తే బీర్ తాగేవారికి గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 42 శాతం తక్కువగా ఉన్నట్లు తెలిసింది. అయితే బీర్ మితంగా తీసుకుంటేనే గుండె ఆరోగ్యంగా ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. 5 శాతం ఆల్కహాల్ తీసుకోవడం మంచి వినియోగం అని .. ఆరోగ్యం అని చెపుతున్నారు.

**బ్లడ్ షుగర్ నియంత్రణ**

చాలా మందికి రక్తంలో చక్కెర (బ్లడ్ షుగర్) ఓ సాధారణ సమస్య అయింది. మితమైన బీర్ వినియోగం వల్ల రక్తంలో చక్కెర లెవెల్స్ ను నియంత్రణలో ఉంచొచ్చు. బీర్ వినియోగం డయాబెటిస్ కు ప్రమాదకరం అయినా ఇన్సులిన్ నియంత్రణకు పనిచేస్తుందన అధ్యయనాలు చెపుతున్నాయి. అయితే చక్కెర తో కూడిన ఆల్కహాలిక్ బీర్ పానియాలను అవాయిడ్ చేయాల్సి ఉంటుంది.

**కిడ్నీ స్టోన్స్**

మూత్రనాళ వ్యవస్థలోఅదనపు కాల్షియం నిల్వల నిరోధించడంలో మితమైన బీర్ వినియోగం సహాయ పడుతుంది. ఇది అధిక మూత్ర ఉత్పత్తి, మూత్ర నాళాలను విస్తరింపజేసి మూత్ర పిండాల రాళ్లను నొప్పి లేకుండా ఫ్లష్ చేస్తుంది. అయితే ఇక్కడో పెద్ద సమస్య ఉంది. అధికంగా బీర్ తాగితే మూత్రపిండాల్లో రాళ్లు వస్తాయి. కాబట్టి బీర్ వినియోగం మితంగా ఉండాలి.

**క్రియేటివిటీని పెంచుతుంది**

బీర్ తాగితే క్రియేటివిటీ పెరుగుతుందట. కాన్షియస్ నెస్ అండ్ కాగ్నిషన్ అనే జర్నల్ చేసిన ఓ అధ్యయనంలో బీర్ సేవించే పురుషులు , సాధారణ పురుషులకంటే వేగంగా శబ్ద పజిల్ లను పరిష్కరించగలరని తేలింది. ఇది సమస్యల పరిష్కార నైపుణ్యాలను మెరుగు పర్చే నమ్మకం స్థాయిని గణనీయంగా పెంచుతుందట.

సో.. బీర్ తాగితే మంచిదే.. కానీ అధికంగా తాగితే ఆరోగ్యానికి ప్రమాదమే.. జాగ్రత్త వహించాలి.

# సీనియర్ హీరోయిన్ల మధ్య పోటీ అస్సలు తగ్గట్లేదుగా!



నయనతార, త్రిష ఎప్పుడూ ఎక్కడా ఒకరి గురించి ఒకరు మాట్లాడింది లేదు, ఎక్కడా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంది లేదు కానీ వీరిద్దరి మధ్య మాత్రం మొదటి నుంచి చాలా గ్యాప్ ఉంది. వీరిద్దరి కెరీర్లు మొదలై చాలా కాలమవుతుంది. కానీ అప్పటికీ, ఇప్పటికీ ఎప్పటికీ వీరి మధ్య సయోధ్య మాత్రం కుదరడం లేదు. అప్పుడెప్పుడో 2008లో వచ్చిన కురువి సినిమాలో నయనతార చేయాల్సిన క్యారెక్టర్ ను త్రిష చేయడంతో ఈ సైలెంట్ వార్ మొదలైందని అందరూ అంటుంటారు. అప్పుడు మొదలైన ఈ సైలెంట్ వార్ ఇప్పటికీ ఆగడం లేదు. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన మూకుతి అమ్మన్ సినిమాను త్రిష వదులుకున్నప్పుడు ఆ సినిమాను నయనతార చేసి దాన్ని సూపర్ హిట్ గా నిలిచేలా చేశారు. ఆ తర్వాత థగ్ లైఫ్ మూవీ ఆఫర్ ముందుగా నయనతార వద్దకు వెళ్లగా ఆమె దాన్ని రిజెక్ట్ చేశారని, ఆ తర్వాతే త్రిష లైన్ లోకి వచ్చిందని అంటారు. కానీ థగ్ లైఫ్ సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా ఫ్లాపైంది. అయితే ఇవన్నీ యాదృశ్చికాలే అయినా వీరు చేస్తున్న సినిమాలు, స్క్రిప్ట్ లు ఎప్పుడూ వారి చుట్టూనే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. ఇప్పటివరకు స్క్రిప్ట్ల విషయంలో చేతులు మారిన సినిమాలు ఇప్పుడు రెమ్యూనరేషన్ కారణంగా చేతుల మారేట్టు కనిపిస్తున్నాయి. అడివెల్లి రీమేక్ కోసం మేకర్స్ నయనతారను సంప్రదించగా ఆమె దాని కోసం రూ.15 కోట్లు అడిగారని సమాచారం. దీంతో ఇప్పుడు నిర్మాతలు త్రిషతో డిస్కషన్స్ చేస్తున్నారని అంటున్నారు. మరి ఈ ఇద్దరిలో అడివెల్లి రీమేక్ ఎవరితో ముందుకెళ్తుందో చూడాలి. ఇండస్ట్రీలో హీరోయిన్లంతా ఎంతో స్నేహంగా ఉంటూ ఉంటారు. అలాంటి ఇండస్ట్రీలో వీరిద్దరి మధ్య జరుగుతున్న విషయాలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఈ ఇద్దరి మధ్య పోటీ ఉన్నప్పటికీ వాళ్లెప్పుడూ కెరీర్లో వెనక్కి తిరిగి చూసుకున్నది లేదు.



పాయల్ రాజ్‌పుత్ షేర్ చేసే ప్రతి ఫ్రేమ్‌లో చాలా అందంగా కనిపిస్తుంది



మీనాక్షి చౌదరి సాఫ్ట్ బ్లూ టోన్స్‌లో శాంతియుత కొత్త చిత్రాన్ని పంచుకున్నారు



## సైయారా విజయంతో శ్రీలీలకు ఎసరు?

కార్తీక్ ఆర్యన్ లాంటి స్టార్ సరసన ఆషిఖి ఫ్రాంఛైజీ చిత్రంతో శ్రీలీల బాలీవుడ్ కి పరిచయమవుతోంది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా పూర్తవుతోంది. అనురాగ్ బసు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది చివరిలో విడుదల కావాల్సి ఉంది. అయితే ఇప్పుడు రిలీజ్ వచ్చే ఏడాదికి వాయిదా పడిందని తెలిసింది. కొత్త కుర్రాళ్లు అహాన పాండే- అనీతా పద్దా జంటగా నటించిన సైయారా బ్లాక్ బస్టర్ విజయం కారణంగా శ్రీలీల- కార్తిక్ ఆర్యన్ ల సినిమా వాయిదా పడిందనేది గుసగుస. సైయారా తో కార్తీక్ సినిమాకి పోలికలు చూడటం ఖాయమని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

అయితే ఇది నిజమా? అని ప్రశ్నిస్తే దానికి దర్శకుడు అనురాగ్ బసు నుంచి ఆసక్తికర సమాధానం లభించింది. సైయారా సినిమాతో కార్తీక్ సినిమాకి పోలికలు చూడటం సహజం. కానీ మా సినిమా ఆలస్యానికి వేరే కారణాలు ఉన్నాయి. నేను మెట్రో ఇన్ డినోతో బిజీగా ఉండటం, అదే సమయంలో కార్తీక్ .. కరణ్ జోహార్ చిత్రం %-%తు మేరీ మై తేరా, మై తేరా తు మేరీ%-%తో బిజీగా ఉన్నాడు. మేం త్వరలో మా తదుపరి షెడ్యూల్‌కు వెళ్తాము. వేగంగా సినిమాను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాము! అని తెలిపారు.

కార్తీక్ ఆర్యన్ - సౌత్ సెన్సేషన్ శ్రీలీల నటించిన రొమాంటిక్ చిత్రం ఆషిఖి ఫ్రాంచైజీలో అనధికారిక త్రీక్వెల్ అని ప్రచారం సాగుతోంది. మ్యూజికల్ డ్రామాలో కార్తీక్ మునుపెన్నడూ చూడని అవతారంలో కనిపిస్తాడని టాక్. ఇంకా టైటిల్ నిర్ణయించని ఈ సినిమా మొదట దీపావళికి విడుదల కావాల్సి ఉంది. అయితే తాజా కథనాల ప్రకారం 2026 లో మాత్రమే థియేటర్లలోకి వస్తుందని సమాచాం. సైయారా కారణంగా ఇది ఆలస్యమవతోందని ప్రచారం సాగుతోంది. కార్తీక్ ఆర్యన్ సినిమాలోని పాత్రలు, ఇతివృత్తం ఒకే తరహాలో ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది. రెండు సినిమాలు వర్ధమాన గాయకులు.. వారి జీవితాలలో ఏం జరిగిందో తెలిపే చిత్రాలు.. ఈ పోలికల కారణంగా అనురాగ్ - కార్తీక్ బృందం తమ స్క్రిప్టును మార్చి రీషూట్ చేయబోతున్నారని కూడా ప్రచారం సాగుతోంది. కానీ ఈ ప్రచారాన్ని అనురాగ్ బసు కొట్టి పారేసారు. అనురాగ్ మాట్లాడుతూ.. మోహిత్ సూరి చిత్రం కథ - స్క్రిప్ట్ గురించి కొంతకాలంగా తనకు తెలుసని అనురాగ్ బసు అన్నారు. రెండు చిత్రాలలో హీరోల పాత్రలకు పోలికలు చూడటం సహజమేనని మాకు తెలుసు. కానీ రెండు చిత్రాలు ఒకదానికొకటి పూర్తిగా భిన్నంగా ఉంటాయి.. అని తెలిపారు. వేరే కారణాల వల్ల మా సినిమా ఆలస్యమవుతుందని వెల్లడించారు.